అసంపూర్తి నిర్మాణాలు

దొరవారిసత్రం శ్రీధనమల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మన బడి నాడు–నేడు కింద అదనపు పాఠశాల భవనం, వంట గది, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇందుకోసం గత ప్రభుత్వం సుమారు రూ.40 లక్షలు మంజూరు చేసింది. కొన్ని పనులు 80 శాతం వరకు పూర్తయ్యాయి. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనుల గురించి పట్టించుకోలేదు. దీంతో పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – దొరవారిసత్రం



కనిపించని బోర్డు



పోలిరెడ్డిపాళెం రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డును సూచిస్తూ ఏర్పాటుచేసిన బోర్డు చిన్నదిగా ఉంది. అంతేగాక ఏ దిక్కునకు వెళ్లాలో మార్కింగ్ లేదు. దీంతో స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు తికమక పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి రైల్వేస్టేషన్‌కు కిలోమీటర్ దూరం ఉంది. చెన్నై, గూడూరు, నెల్లూరు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు మెమూ రైళ్ల కోసం పోలిరెడ్డిపాళెం రైల్వే స్టేషన్‌కు వస్తుంటారు. కొత్త వారు స్టేషన్ రోడ్డు కోసం పలువురిని అడగాల్సి వస్తోంది. రైల్వే అధికారులు స్పందించి బోర్డును కొంచెం పెద్దగా కనిపించేలా ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. – దొరవారిసత్రం

గోడలతోనే వదిలేశారు

చిట్టమూరు మండలంలోని ఆరూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు అసంపూర్తిగా వున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పనులు దక్కించుకున్న కూటమి నేతలు రెండు భవనాలకు సంబంధించి పిల్లర్లు వేశారు. ఇందుకు గాను సుమారు రూ.19 లక్షలు డ్రా చేసుకున్నట్టు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు తెలిపారు. అసంపూర్తిగా వదిలేసిన భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. – చిట్టమూరు



క్లుప్తంగా

సుబ్రమణ్యేశ్వర స్వామికి కవచాలు బహూకరణ



స్వామి, అమ్మవార్లకు కవచాలు అందజేస్తున్న దాతలు

చిట్టమూరు : మండలంలోని మల్లాంలో వెలసిన సుబ్రమణ్యేశ్వర స్వామికి ఆదివారం కోటకు చెందిన కంతం వెంకటసుబ్రమణ్యం కుమారుడు షణ్ముఖ సందీప్ పంచలోహ కవచాలు బహూకరించారు. వీటి విలువ సుమారు రూ.3 లక్షలు విలువ ఉంటుందన్నారు. స్వామి, అమ్మవార్లకు మంగళ, ఆదివారాల్లో నిర్వహించే విశేష పూజలతో పాటు బ్రహ్మోత్సవాల్లో వీటిని అంకరిస్తామని ఆలయ అర్చకులు మాలం రాజు బాబుప్రకాష్ శర్మ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నేత మృతి

నాయుడుపేటటౌన్ : మండలంలోని కోనేటిరాజు పాళెం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓజిలి మండల అత్తివరం గ్రామానికి చెందిన వెల్ల గురుమూర్తి(52) మృతి చెందాడు. వివరాలు.. నాయుడుపేట నుంచి బైక్‌పై అత్తివరం వెళుతుండగా గ్రీన్‌టెక్ పరిశ్రమ దాటిన తర్వాత వెనుక నుంచి వస్తున్న టాటా మేజిక్ వాహనం ఢీకొంది. సుమారు కిలోమీటరు వరకు గురుమూర్తిని లాక్కెళ్లింది. దీంతో గురుమూర్తి దుర్మరణం చెందారు. వెనుక కూర్చున్న అనిల్ రెడ్డి అనే వ్యక్తి గాయపడ్డారు. మృతదేహాన్ని పోలీసులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన అనిల్ రెడ్డికి చికిత్స పొందుతున్నాడు.

ఘనంగా బాలవికాస్ కేంద్ర వార్షికోత్సవం



మాట్లాడుతున్న భయ్యా వాసు

రాపూరు: రాపూరు సమీపంలోని మద్దెలమడుగు వద్ద సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో బాల వికాస్ కేంద్ర పాఠశాల వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత ప్రముఖ్ భయ్యా వాసు మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే పిల్లలకు హిందూ ధర్మం, సంప్రదాయాలను నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధి జయకృష్ణ ప్రభూజీ, ఎస్‌ఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కన్వీనర్ రమేష్, మహిళా కన్వీనర్ అంజమ్మ, ప్రవంతి, భాస్కర్, మారుతీశ్వరావు, రాఘవరెడ్డి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

అంకాళపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

రాపూరు : మండలంలోని వేపినాపి సమీపంలో పోతుకొండలో కొలువై ఉన్న అంకాళ పరమేశ్వరికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఉదయం అభిషేకం, ప్రత్యేక పుష్పాలతో పూలంగి సేవ చేశారు. అమ్మవారిని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి తలనీలాలు సమర్పించారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

తూనికలు, కొలతల్లో తేడాలుంటే చర్యలు



గ్యాస్ గోడౌన్ వద్ద తనిఖీ చేస్తున్న మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్

చిట్టమూరు : తూనికలు, కొలతల్లో తేడాలు ఉంటే వ్యాపారులపై చర్యలు తప్పవని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు తెలిపారు. ఆయన ఆదివారం చిట్టమూరు, కొత్తగుంట, ఎల్లసిరి గ్రామాల్లో దుకాణాల్లో తనిఖీలు చేశారు. కాటాల కొలతలు, తమ శాఖ ద్వారా వేయించుకున్న ముద్రలను పరిశీలించారు. తూకం రాళ్లకు ప్రతి ఏటా ముద్ర వేయించుకోవాలని సూచించారు. చికెన్ షాపుల్లో తూకాల్లో తేడాలు ఉన్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. అలాగే గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు 15 కిలో మీటర్లకు వరకు అధిక ధర వసూలు చేయకూడదని తెలిపారు. 15 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉంటేనే ఆటో చార్జీ రూ.20 నుంచి రూ.30లను వినియోగదారుల నుంచి తీసుకోవాలన్నారు. గోడౌన్ నుంచి ఆటో బయలుదేరితే ఒక్కో సిలిండర్‌కు రూ.50 వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. తమ దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

గూడూరు రూరల్/చిల్లకూరు : నేరాల నియంత్రణకే గూడూరు పట్టణ సమీపంలోని శివారు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ గీతా కుమారి తెలిపారు. గూడూరు రెండో పట్టణం సమీపంలోని తిలక్‌నగర్‌లో ఆదివారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు.

చోరీలపై అవగాహన

వేసవిలో చోరీలు జరిగే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన ఆదివారం చోరీల నియంత్రణపై ఆటోలో ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఇంటిలో నగదు, బంగారం ఉంచవద్దన్నారు. పక్కవారికి సమాచారం ఇచ్చి బలమైన తాళాలు వేయాలని సూచించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



విజేత జట్టుకు కప్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, బట్టా పృథ్వీకుమార్ యాదవ్

ఓజిలి: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. మండలంలోని వెంకటరెడ్డిపాళెం పంచాయతీలో వైఎస్సార్ సీపీ యువత అధ్యక్షుడు బట్టా పృథ్వీకుమార్‌యాదవ్, బట్టా అనీల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో రాజుపాళెం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఫైనల్ పోటీల్లో విజయం సాధించిన టీమ్ సభ్యులకు ఆదివారం కప్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి శిక్షణ ఇస్తే ఉత్తమ క్రీడాకారులను తయారు చేయవచ్చన్నారు. 20 జట్లతో నెలరోజులు పాటు టోర్నమెంట్‌ను నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్‌బాషా, సర్పంచ్ కొండూరు ప్రభాకర్‌రాజు, నాయకులు దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, దేవారెడ్డి అఖిల్‌రెడ్డి, ముమ్మారెడ్డి రవీంద్రర్‌రెడ్డి, ఎద్దల శివారెడ్డి, బట్టా సుధాకర్‌యాదవ్, జమళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఫైనల్ మ్యాచ్

రాజుపాళెం ప్రీమియం లీగ్ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన రాజుపాళెం లెవన్స్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 103 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనూష్ లెవన్స్ జట్టు 91 పరుగులకు ఆలౌట్ అయింది. మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుకు మాజీ ఎమ్మెల్యే మొదటి బహుమతి రూ.20 వేలు నగదు, కప్ అందజేశారు. రన్నర్‌కు రూ.10 వేలు నగదు, కప్ అందజేశారు.

రైతులను బెదిరిస్తే కోర్టును ఆశ్రయిస్తాం



మాట్లాడుతున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

కోట: క్రిస్ సిటీలో పరిశ్రమల కోసం భూములిచ్చిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. అలాకాకుండా రైతులను బెదిరిస్తే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. ఆయన ఆదివారం శ్రీనివాససత్రంలో ఇటీవల ధ్వంసం చేసిన పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న హయాంలో క్రిస్ సిటీ నిర్మాణానికి రూ.వెయ్యి కోట్లతో టెండర్లు పిలిచినట్టు తెలిపారు. ఇందులో కోసం కోట, చిల్లకూరు మండలాల్లో 2500 ఎకరాల భూములు సేకరించినట్టు తెలిపారు. రైతులకు నష్ట పరిహారం చెల్లించాకే పనులు మొదలు పెడతామని ఏపీఐఐసీ అధికారులు తెలిపారు. కూటమి ప్రభు త్వం నష్ట పరిహారం చెల్లించకుండానే రైతుల నుంచి భూములను లాక్కుంటున్నారని ఆరోపించారు. రోడ్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ పేరుతో పొలాలను నాశనం చేశారని దుయ్యబట్టారు. పది రోజుల్లో చేతికి వచ్చే వేరుశనగ పంటను యంత్రాలతో తొక్కించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ స్పందించకపోవడం దారుణమన్నారు. రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్న అధికారులపై రైతుల పక్షాన కోర్టును ఆశ్రయిస్తామని శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తపట్నం సర్పంచ్ తిరుపాలయ్య, ఉపసర్పంచ్ ప్రసాద్‌గౌడ్, వైస్ ఎంపీపీ శేషయ్య, రాధాక్రిష్ణారెడ్డి, వెంకటాద్రి, సాయిరెడ్డి, వెంకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పంట కాలువ మరమ్మతు పనులు



పనులు చేస్తున్న యంత్రం

పెళ్లకూరు: మండలంలోని జీలపాటూరు, చావలి, కొత్తూరు చెరువులకు నీరు అందించే పంట కాలువ మరమ్మతు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. కాలువలో ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో చెరువులకు నీరు రావడం లేదు. ఈ క్రమంలో ప్రభుత్వం రూ.20 లక్షల ఎఫ్‌డీఆర్ నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో కాలువలో చెట్ల తొలగింపు పనులు చేపట్టారు. చిల్లకూరు వడ్డిపాళెం గ్రామం వద్ద 71వ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ అభివృద్ధి పనుల్లో భాగంగా అక్కడి వ్యవసాయ కాలువ 70 శాతం పోయింది. దీంతో జీలపాటూరు చెరువుకు నీరు చేరే పరిస్థితి లేదని, దీనిపై అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణం

తడ: మండలంలోని వాటంబేడు గ్రామం మత్స్యకారుల కుప్పంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మూడో రోజు ఆదివారం ద్రౌపదీ కల్యాణాన్ని కనుల పండువగా చేపట్టారు. ముందుగా భారత పఠనం, చిత్రసేన యుద్ధం నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో భక్తుల సమక్షంలో వేద మంత్రోచ్చరణల మధ్య ద్రౌపదీ దేవి కల్యాణాన్ని నిర్వహించారు. రాత్రి ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకణలు, భారీ కటౌట్లు ఆకట్టుకున్నాయి. సోమవారం రాజసూయ యాగం, ద్రౌపదీ వస్త్రాపహరణం, గ్రామోత్సవం నిర్వహించనున్నట్టు గ్రామ పెద్దలు బొమ్మన్ పళని, బొమ్మన్ శ్రీధర్, శెట్టి గంగాధరం శెట్టి, కరింగాలి గురునాథం శెట్టి, బోడి మాణిక్యం శెట్టి, బొమ్మన షణ్ముగం తెలిపారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

కోట: ఈ విద్యా సంవత్సరంలో బీసీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం పరీక్ష నిర్వహించారు. 129 మంది దరఖాస్తు చేసుకున్నారు. 104 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ నారాయణరావు తెలిపారు. పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించినట్లు తెలిపారు.

నేటి నుంచి వేసవి శిక్షణా శిబిరాలు ప్రారంభం

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని మహాత్మా గాంధీ గ్రంథాలయంలో సోమవారం నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరం ప్రారంభించనున్నట్లు గ్రంథాలయ అధికారి అంజయ్య, లీలావతి తెలిపారు.

పదిలో ఫెయిలైన విద్యార్థులకు నేడు ప్రత్యేక తరగతులు

నాయుడుపేట టౌన్ : 10 తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం నాయుడుపేటలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో మునిరత్నం తెలిపారు. మే నెలలో జరగబోయే సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు హాజరుకావాలన్నారు.

2 నుంచి క్రికెట్ శిక్షణా శిబిరం

గూడూరు రూరల్ : గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో మే 2 నుంచి నెల రోజులు వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్టు ఏసీఏ సబ్ సెంటర్ ఇన్‌చార్జి కె.మునిగిరీష్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. శిబిరానికి 7 నుంచి 16 ఏళ్లలోపు పిల్లలు రావొచ్చని తెలిపారు. క్రీడాకారులకు డైట్‌తోపాటు స్పోర్ట్స్ షర్ట్స్ అందజేస్తామని వెల్లడించారు. నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కౌన్సిలర్ అనీల్‌కుమార్, సీనియర్ కోచ్ సురేంద్రరెడ్డి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కోచ్ లవకుమార్, గూడూరు క్రికెట్ క్లబ్ సెక్రటరీ నాగేశ్వరరావు, మహేష్, నూర్ మొహ్మద్, రజని తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అమిత్ కటారియా, వంకి పెంచలయ్య

గూడూరు రూరల్ : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలుగుతారని న్యూజెర్సీకి చెందిన సరాస్, ఏఐ కో–ఫౌండర్, సీఈవో అమిత్ కటారియా తెలిపారు. గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం 2024–25 చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల ప్లేస్‌మెంట్ విజయోత్సవ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రిక్రూట్‌మెంట్స్ చాలా నెమ్మదించాయని తెలిపారు. నిబద్ధత, క్రమశిక్షణ, సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగితే అవకాశాలు వాటంతట అవే వస్తాయన్నారు. అనంతరం ఉపాధి అవకాశాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యాసంస్థల చైర్మన్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ తమ విద్యా సంస్థలో అపార అనుభవం కలిగిన అధ్యాపకులతో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ అనూష, సీడీసీ డీన్ శ్రీనివాస, ఐక్యూఏసీ డీన్ టి.వేణుమాధవ్, అకడమిక్ డీన్ రాజయ్య, డాక్టర్ ధనుంజయ, ఏవో రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సూపర్-30 టోర్నీ విజేత వాకాడు జట్టు



వాకాడు: గూడూరులో జీఆర్‌సీసీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీల్లో వాకాడు అండర్–15 జట్టు విజేతగా నిలిచింది. గూడూరు డివిజన్ స్థాయిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో 15 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో వాకాడు, చెన్నూరు మధ్య జరిగిన పోటీల్లో వాకాడు జట్టు విజయం సాధించి కప్‌తో పాటు నగదు బహుమతి సొంతం చేసుకుంది.

రోడ్డుపై బైఠాయించిన ప్రైవేటు బస్సుల డ్రైవర్లు

- వివాదంగా మారిన బైక్‌ను బస్సు ఢీకొన్న ఘటన
- మేనకూరు వద్ద స్తంభించిన ట్రాఫిక్



ట్రాఫిక్ స్తంభించడంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మండలంలోని వద్దిగుంటకండ్రిగలో ఆదివారం పరిశ్రమలకు ఉద్యోగులను తరలిస్తున్న బస్సు బైక్‌ను ఢీకొంది. బైక్ దెబ్బతినింది. బాధితుడిపోపాటు మరో ముగ్గురు యువకులు డ్రైవర్‌ను నిలదీశారు. అతను నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో రెండు దెబ్బలేశారు. దీంతో రెచ్చిపోయిన బస్సు డ్రైవర్ ఈ విషయాన్ని ఇతర బస్సుల డ్రైవర్లకు తెలిపాడు. వారు పెద్ద సంఖ్యలో వద్దిగుంట కండ్రిగ గ్రామ సమీపంలో ఉన్న చలివేంద్రం వద్దకు చేరుకున్నారు. రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో మేనకూరు వరకు వాహనాలు నిలిచి పోయాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చెరుకుని డ్రైవర్లతో చర్చించి ఆందోళనను విరమింపజేశారు. ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు ఇష్టానుసారంగా బస్సులను నడుపుతున్నారని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

తిరుపతికి ఆర్టీసీ బస్సు ప్రారంభం



చిట్టమూరు : బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న రీజనల్ మేనేజర్

చిట్టమూరు : మండల కేంద్రం చిట్టమూరు నుంచి జిల్లా కేంద్రం తిరుపతికి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సును ఆదివారం రీజనల్ మేనేజర్ నరసింహులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ సర్వీసు ఉదయం ఆరు గంటలకు కోట ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయలుదేరి వాకాడు మీదుగా చిట్టమూరుకు 6.30 గంటలకు చేరుకుంటుందని, అక్కడి నుంచి తిరుపతికి 9 గంటలకు చేరుతుందన్నారు. ఇలా రోజుకు మూడు ట్రిప్పులు తిరుగుతాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్, గణపర్తి కిశోర్‌నాయుడు, మెకానికల్ ఇంజినీర్ నారాయణ, సూపర్‌వైజర్ నారాయణ పాల్గొన్నారు.

అల్లంపాడుకు..



కోట: బస్సును ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ పెంచలయ్య

కోట: అల్లంపాడు- నెల్లూరు బస్సు సర్వీసును ఆదివారం అల్లంపాడులో వాకాడు ఆర్టీసీ డిపో మేనేజర్ పెంచలయ్య ప్రారంభించారు. నష్టాలు వస్తున్నాయన్న కారణంతో గతంలో అల్లంపాడు సర్వీసును రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల గ్రామాల ప్రజలు ఆర్టీసీ ఉన్నతాధికారులను కలిసి బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరారు. ఈ క్రమంలో అల్లంపాడు సర్వీసును తిరిగి ప్రారంభించారు. వాకాడు డిపో మేనేజర్ పెంచలయ్య మాట్లాడుతూ ప్రయాణీలకు అనుకూలంగా బస్సులను నడుపుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరరెడ్డి, ఉపసర్పంచ్ దేవరాల రాంబాబు, ఆర్టీసీ సిబ్బంది రఘురామయ్య, నారాయణ పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ



రాపూరు: జమ్ముకాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ రాపూరు పట్టణానికి చెందిన ముస్లింలు ఆదివారం రాత్రి కొవ్వొత్తులలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పెద్ద మసీదు నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు సాగింది. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు.

కొండచిలువ హల్‌చల్



చిల్లకూరు : గూడూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నడిరోడ్డుపై ఆదివారం ఉదయం కొండచిలువ హల్‌చల్ చేసింది. బస్టాండ్‌కి ఎదురుగా చెరువు కట్టపై ఇటీవల జంగిల్ క్లియరెన్స్ చేయడంతో ఆ ప్రాంతంలో ఉండే సర్పాలు పంట పొలాల్లోకి వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే కొండచిలువ రోడ్డుపై అడ్డంగా వస్తుండడంతో ఇరువైపుల వాహనాలు నిలిచిపోయాయి. శబ్దాల దాటికి కొండ చిలువ డివైడర్ పక్కనుంచి ముళ్ల పొదల్లోకి వెళ్లిపోయింది.

ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతి





చిల్లకూరు : విద్యార్థినులకు నగదు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు, డక్కిలిలో..

చిల్లకూరు : పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు ఏడుగురికి బలిజ సంక్షేమ సంఘం ప్రతినిధులు నగదు బహుమతి అందజేశారు. సంఘం అధ్యక్షులు ఆర్. పద్మావతి మాట్లాడుతూ అడపాల సురేష్ జ్ఞాపకార్థం ఆయన సతీమణి పేద పిల్లలకు నగదు ప్రోత్సాహకాలు అందజేసినట్టు తెలిపారు. అలాగే రాష్ట్ర స్థాయిలో 3వ స్థానం సాధించిన సాయివైశాలికి ఎం.శ్రావ్య నగదు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షురాలు సారంగి సులక్ష్మి, సనీత సేవా సంస్థ అధ్యక్షులు సారంగం శ్రీనివాసులు, ఉపాధ్యక్షురాలు అరుణ, సువర్ణలక్ష్మి, ఉషా పాల్గొన్నారు .

డక్కిలిలో..

డక్కిలి : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన వెంకటగిరి గురుకుల పాఠశాల విద్యార్థిని కలపాటి ఇంద్రజకు ఉత్తరప్రదేశ్ ఝాన్సీ జిల్లా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు బీబీజీటీఎస్ మూర్తి రూ.5 వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు వినయ్, వరమ్మ, కలపాటి శేఖర్, కలపాటి సంపూర్ణమ్మ, బత్తల భాస్కర్, సుందరయ్య, డేనియల్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటుతోపాటు తుమ్మూరు 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల వల్ల సోమవారం సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు కరెంటు నిలిపేస్తున్నట్టు ఏఈ ఎస్.శివశంకర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాలాయపల్లి తహసీల్దార్‌గా విజయలక్ష్మి

బాలాయపల్లి(సైదాపురం) : చిట్టమూరు డీటీగా పనిచేస్తున్న విజయలక్ష్మి పదోన్నతిపై బాలాయపల్లి తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కూల్ డ్రింక్ షాపులో చోరీ

వాకాడు : వాకాడు అశోక్ స్తంభం కూడలి వద్దనున్న కూల్ డ్రింక్ షాపులో దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికుల కథనం మేరకు.. వాకాడు దళితవాడకు చెందిన చింతల రమణమ్మ అశోక్ స్తంభం కూడలిలో కూల్ డ్రింక్ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తోంది. శనివారం రాత్రి దుండగులు షాపు తాళాలు పగులగొట్టి రూ.10 వేల నగదు, కూల్‌డ్రింక్స్ బాటిళ్లు, తినుబండారాలు చోరీ చేశారు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గూడూరు : 90108 97733, 99122 20591
వెంకటగిరి : 99122 20591
సూళ్లూరుపేట : 90102 23710